

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,19 సెప్టెంబర్ 2025

8 పేజీలు


## నియోజకవర్గాల పునర్విభజన తరువాతే

# మార్పులు,చేర్పులు చేయాలి

### ఇప్పుడు చేసి,మళ్లీ అప్పుడు చేస్తే ప్రజలకు ఎన్నో ఇబ్బందులు ?




**ఏలూరు,ఉమ్మడిప.గో.జిల్లా సూర్యబ్యూరో** : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు మార్చడానికి తీవ్రంగా కసరత్తు చేస్తోంది. దీనికోసం రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన సంగతి విధితమే. ఉప సంఘం ఇప్పటికి రెండుసార్లు సమావేశం అయింది.అయితే కేంద్రప్రభుత్వం2027లో నియోజక వర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) ప్రక్రియ ప్రారంభించి 2029లో జరిగేసాధారణ ఎన్నికలకు అసెంబ్లీ నియోజక వర్గాలు, పార్లమెంటరీ నియోజక వర్గాల సంఖ్య పెంచి ఎన్నికలకు వెళ్ళనుంది. అప్పుడు ఇప్పుడున్న 175 అసెంబ్లీ నియోజకవర్గాలు 50కి పెరిగి మొత్తం 225నియోజకవర్గాలుగా,25 పార్లమెంటు స్థానాలు 10కు పెరిగి 35 కానున్నట్టు సమాచారం. అయితే దక్షిణాది రాష్ట్రాలలో పార్లమెంట్ స్థానాలసంఖ్య తగ్గే అవకాశాలు ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాలు పెరుగుతాయి .అప్పుడు జిల్లాలు మారిపోయి, నియోజకవర్గాలు మారిపోయి,అందులో మండలాలు మారిపోయి,కొన్ని చోట్ల గ్రామాలు మారిపోయి రూపురేఖలు మరోసారి మారనున్నాయి. ఇప్పటికే గత వైసిపి ప్రభుత్వం పార్లమెంటరీ నియోజకవర్గం కేంద్రంగా జిల్లాలు ఏర్పాటు చేసిన విషయం విధితమే 13 జిల్లాలు 26గా అమలు అవుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ కొత్త జిల్లాలు ఏర్పాటుకు కసరత్తు చేస్తుండగా అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు,గ్రామాల పరిధి మార్చాలనే డిమాండ్లు ప్రభుత్వానికి అందుతున్నాయి.

కానీ ఇప్పుడు మార్పులు చేసి, మళ్లీ 2029లో కూడా తప్పనిసరిగా మార్పులు చేయాల్సి వస్తే పాలనాపరమైన గందరగోళం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కనుక రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుంటే ప్రజలకు మరింత మేలు జరిగి,రాష్ట్ర పరిపాలన కూడా సులభంగా జరిగే అవకాశాలు ఉంటాయనేది ఒక వాదనగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేస్తే మంచిదనే విషయం వినిపిస్తోంది.

## జనసేన శాసనసభా పక్ష సమావేశంలో విప్ నాయకర్



**విజయవాడ/నరసాపురం,మేజర్‌న్యూస్** : జనసేన శాసనసభ పక్ష కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. సభలో ప్రస్తావించాల్సిన ముఖ్యఅంశాలు, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

## షటిల్ ఆడుతూ కుప్పకూలిపోయి వ్యక్తి మృతి



**పెనుమంట్ర,మేజర్‌న్యూస్** : ఉదయాన్నేవ్యాయామంలో భాగంగా షటిల్ బ్యాట్ మెంటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి గుండె పోటుతో నల్లిమిల్లి గోపి(48)అనే వ్యక్తిమృతిచెందిన విషాధ సంఘటన మల్లిపూడిలో చోటుచేసుకుంది. ఆయనకు కుమారుడు,కుమార్తె, భార్య ఉన్నారు. గోపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం వైయస్సార్సీపీఎస్సీ విభాగం కన్వీనర్ పనిచేశారు. దీంతో పార్టీ నాయకులు గ్రామ ప్రముఖులు పెద్ద ఎత్తున మల్లిపూడి వచ్చి నల్లమిల్లి గోపి

- తరువాయి 2లో..

## తపస్ విద్యా సంస్థల అధినేత కృష్ణకు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు

**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** జంగారెడ్డిగూడెంలోని తపస్ విద్యా సంస్థల అధినేత,ప్రముఖ ఆడిటర్, రోటరీ పూర్వపు అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణకు రాజ్ న్యూస్ (తెలుగు) ప్రకటించిన బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర,కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు.విజయవాడలోని ఎన్‌కన్వెన్షన్ హాల్లో బుధవారం రాత్రి నిర్వహించిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మంత్రులతో పాటుగా శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్,రాజ్ న్యూస్ సీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.ఈసందర్భంగా మంత్రులు, ఇతర ప్రముఖులు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో వ్యాపార, వాణిజ్య రంగాలు, సేవా రంగంలో కృష్ణ భాగస్వామ్యం వహించారని పేర్కొన్నారు.కనుక ఆయా రంగాల్లో ప్రతిభ పాటాలు చూపించి అభివృద్ధి పధంలో ప్రయాణిస్తున్నవారిని గుర్తించి రాజ్ న్యూస్ సంస్థ ఈవిధంగా అవార్డు ఇచ్చి ప్రోత్సహించడం గొప్ప విషయం అని కొనియాడారు.




రాష్ట్ర నలుమూలలల నుంచివచ్చిన అవార్డు గ్రహీతలతో ఏకన్వెన్షన్ ప్రాంగణం కళకళలాడింది.మొదట రాజ్ న్యూస్ సీఈవో లక్ష్మణరావు అవార్డు గ్రహీతల్ని పేరు పేరునాపలకరించివారికిప్రత్యేకంగా అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.

## ముగ్గురు మోటారు సైకిళ్ళ దొంగల అరెస్టు

- రూ.13 లక్షల 55 వేల విలువైన 18 స్వాధీనం
- విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి

**ఏలూరు,మేజర్‌న్యూస్** : వివిధ జిల్లాలలో మోటార్ సైకిళ్ళ నేరాలకుపాల్పడుతున్నముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 18 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్న ఏలూరు వన్ టౌన్,నిడమర్రు సర్కిల్,కైకలూరు సర్కిల్,పోలీస్ అధికారులు. మోటార్ సైకిళ్ళ విలువ 13 లక్షల 55 వేల రూపాయలు ఈ వివరాలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో

- తరువాయి 2లో..





## మంత్రి లోకేష్‌కి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కామినేని

**కైకలూరు,మేజర్‌న్యూస్:** గవర్నమెంట్ అసురన్సెస్ కమిటీ చైర్మన్ కైకలూరు శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ అసెంబ్లీ సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని అసెంబ్లీలో రాష్ట్ర విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్‌ని

- తరువాయి 2లో..

# పెరియార్ రామస్వామి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజలందరికీ సమాన హక్కుల కోసం, స్త్రీ పురుష సమానత్వం కోసం, కుల నిర్మూలన కోసం అవిశ్రాంతంగా పోరాడిన పెరియార్ రామస్వామి పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ నాస్తికులు డాక్టర్ పెరియార్, సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తమిళనాడుకు చెందిన పెరియార్ రామస్వామి జయంతి కార్యక్రమాన్ని ఏలూరు స్ఫూర్తి భవన్లో ఏపీ హేతువాద సంఘం ఆధ్వర్యంలో కే రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పిరియార్, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాస్తికోద్యమ పితామహుడు, మానవవాది, సంఘసంస్కర్త, ద్రావిడ ఉద్యమ వ్యవస్థాపకుడు, హేతువాది పెరియార్ రామస్వామి జీవితం చాలా ఆదర్శవంతమైందని వారు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, తర్వాత వరుసలో పెరియార్ రామస్వామి సామాజిక విప్లవకారుడుగా ఖ్యాతి పొందారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ హేతువాద నాయకులు కే రామాంజనేయులు, సీనియర్ న్యాయవాది వాకాడ రాజారావు,ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, డి రవికుమార్, కే నరసింహం, డి.గంగాధర్ రావు,కే సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పుప్పాల కన్నబాబు, వర్క శ్యామల, బుగత జగన్నాథం, ఎం క్రాంతి కుమార్, గేదెల నాగేశ్వరరావు, కనకం జగన్, డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యారంగ సమస్యల రణభేరీ జాత ఏలూరు రాక

ఏలూరు,మేజర్ న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పాఠశాలలో సమయం మొత్తం బోధనకే ఉపయోగించే లాగున బోధ నేతర పనులను నిరోధించాలని, ఆర్థిక సమస్యలు పెండింగ్ లో ఉన్న మూడు డిఎ లను ప్రకటించడం,డిఎరియర్లు ఇవ్వడం గత పిఆర్సి ఏరియర్లు ఇవ్వడం 12 వ పిఆర్సి కమిషన్ నియమించడం అంతవరకు ఐ ఆర్ ప్రకటించడం 2022 నుండి పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ లను మంజూరు చేయటం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల నుండి రణభేరి బైక్ జాతాలు కొనసాగుతున్నాయి.ఈ జాత 19వ తేదీ ఏలూరు జిల్లాలో ఉదయం 8 గంటలకు ఉంగుటూరు మండలం నారాయణపురం హై స్కూల్ వద్ద నుండి ప్రారంభించబడుతుంది భీమడోలు, ద్వారకాతిరుమల,జంగారెడ్డిగూడెం, టీ నర్సాపురం మండలం, చింతలపూడి మీదుగా సాయంత్రం 5 గంటలకు ఏలూరు చేరుతుంది.

ఏలూరు యూటీఎఫ్ కార్యాలయంలో ముగింపు సమావేశం జరుగుతుంది రణభేరి జాత కార్యక్రమంలో రాష్ట్ర నాయకత్వం ఐదు జిల్లాల ప్రధాన నాయకత్వంతో పాటుగా జిల్లా అన్ని మండలాల నుంచి వందలాది మంది నాయకులు,కార్యకర్తలు పాల్గొంటారు. ఈ జాతాలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు పాల్గొని వారి సమస్యలను రాష్ట్ర నాయకత్వానికి ఇవ్వటంతో పాటుగా రణభేరి జాతను విజయవంతం చేయవలసిందిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ రవికుమార్ రుద్రాక్షి కోరుతున్నారు.

# స్వస్తి నారి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెప్టెంబర్ 18 వ తేదీ గురువారం స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పెరవలి మండల పరిషత్ అధ్యక్షులు కార్చెర్ల సీతారాం ప్రసాద్, కానూరు సర్పంచ్ భావన మధుపూర్ణ చందు, నడిపల్లి గ్రామ సర్పంచ్ బేర సత్యవేణి రాజులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంచడం మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం పోషకాహారాన్ని ప్రోత్సహించడం కుటుంబాలను స్వశక్తి చేయడం వంటి కార్యక్రమాలు వైద్య సిబ్బంది సహకారంతో చేస్తామని అన్నారు. పెరవలి ఎంపీపీ కార్చెర్ల సీతారామ ప్రసాద్ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది.తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుంది అన్నారు. కానూరు పిహెచ్సి వైద్యులు డాక్టర్ హేమరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు మరియు పారా మెడికల్ సిబ్బంది సహకారంతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాలలో అందించే వైద్య సేవలు. మహిళలలో గుండె జబ్బులు, మధు మేహం, నోటి కాన్సర్ మరియు గర్భాశయ కాన్సర్ లను పరీక్షల ద్వారా తగిన వైద్యచికిత్స లను మరియు రెఫరల్ సేవలను అందించడం జరుగుతుంది అన్నారు.మహిళలు మరియు కిశోర బాలికలలో రక్త హీనత ను గుర్తించి తగిన చికిత్సలను చేయడం.బాలికలలో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స అందిస్తాము అన్నారు. గర్భవతులను పరిక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను తీసుకోవల్సిన జాగ్రత్తలను గురించి కౌన్సిలింగ్ నిర్వహించడం కిశోర బాలికలలో హిమోగ్లోబిన్ పరీక్షలు చేయడం,రక్త హీనత కలవారికి చికిత్స చేయడం జరుగుతుంది అన్నారు. గర్భిణులకు ఎమ్సిపి కార్డ్ లు అందజేయడం జరుగుతుంది అన్నారు. పిల్లలలో సికిల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి చికిత్స చేయడం జరుగుతుంది అన్నారు. పిల్లలకు మరియు గర్భిణి స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు అంద చేస్తాము అన్నారు.యుక్త వయస్సు బాలికలు మరియు మహిళలకు బహిస్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరుగుతుంది.

# లాటరీ ప్రక్రియ ద్వారా ఓపెన్ కేటగిరిలో బార్ల కేటాయింపు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** 2025 – 28 సంవత్సర కాలానికి ఓపెన్ కేటగిరి లో మద్యం బార్లకు గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి లాటరీ తీశారు. జిల్లా నందు నూతన బార్ పాలసీ 2025–28 భాగంగా ప్రభుత్వం వారు మొదటి నోటిఫికేషన్లో మిగిలిన 9 ఓపెన్ కేటగిరి బార్లు కు ఈ నెల 3న ఇచ్చిన గెజెట్ నోటిఫికేషన్ ద్వారా వచ్చిన 8 అప్లికేషన్ లకు గాను 4 లేదా అంతకు పైన వచ్చిన అప్లికేషన్స్ బార్లకు 2 ఓపెన్ కేటగిరి బార్లుకు కలెక్టర్ లాటరీ ద్వారా కేటాయించారు. ఈ లాటరీ ద్వారా ప్రభుత్వం వారికి 59.13 లక్షల ఆదాయం సమకూరినది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా మధ్య నిషేధ,అబార్కిఅధికారి ఏ.ఆవులయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు, అజయ్ కుమార్ సింగ్,ఏలూరు ఎక్సైజ్ సీఐలు బార్లకు దరఖాస్తు చేసిన 6 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

## షటిల్ ఆడుతూ కుప్పకూలిపోయి వ్యక్తి మృతి

మొదటిపేజి తరువాయి

భౌతిక కాయానికి పూలమాలలతో నివాళులర్పించారు.వైసిపి నాయకులు గుడిమెట్ల గంగాధర్ రెడ్డి,కర్రీ వేణు బాబు, పాలసత్తి రామిరెడ్డి, సుంకర సీతారాం,ఈద్ ప్రవీణ్, బుర్ర రవికుమార్, ప్రేమ్ కుమార్, సురేష్రెడ్డి, నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## ముగ్గురు మోటారు సైకిళ్ళ దొంగల అరెస్టు

మొదటిపేజి తరువాయి

జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివ కిషోర్, ఎఎస్పి నక్క సూర్యచంద్రరావు, డిఎస్పి డి.శ్రావణ్ కుమార్,తదితర పోలీస్ అధికారులు వెల్లడించారు. ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముద్దాయి మందపాటి జీవన్ భీమడోలు బీసీ కాలనీ కి చెందిన యువకుడిని అదుపులోని తీసుకొని అతని వద్ద నుండి 7 మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. వాటి ఈ విలువ రూ.4లక్షల55 వేలు. నిడమర్రు సర్కిల్ పరిధిలో ఇద్దరు ముద్దాయిలు జక్కుల ప్రభు కుమార్ పాలమూరు గ్రామము ఉండి మండలం చట్టంతో విభేదించిన బాలుడుని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 5 మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.వాటి విలువ 3 లక్షల 55వేలు రూపాయలు. కైకలూరు రూరల్ సర్కిల్ పరిధిలో ఒకముద్దాయిషేక్ ఇమ్రాన్ కృష్ణానగర్ తాడేపల్లి గుంటూరు జిల్లాఅనే యువకుడ ిని అదుపులోకి తీసుకొని 6మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ 5లక్షల40వేలు రూపాయలు.పై ముగ్గురు నేరస్తులు ఏలూరు జిల్లా, కృష్ణాజిల్లా,ప్రకాశం జిల్లాలలో మోటార్ సైకిళ్ళ ' నేరాలకు పాల్పడ్డారు. స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2,దెందులూరు పోలీస్స్టేషన్ పరిధిలో 1,తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 1,భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి గన్నవరం పోలీస్ స్టేషన్ కృష్ణా జిల్లా పరిధిలో 1 ,గణపవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 3,నిడమర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో1,చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ,కలిదిండి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ,ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ,పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ,ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ,ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ,మొత్తం 18 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి తెలిపారు.

## మంత్రి లోకేష్కి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కామినేని

మొదటిపేజి తరువాయి

కలిసారు. రాష్ట్రంలో విద్యా,ఐటీ శాఖలలో లోకేష్ తెస్తున్న విప్లవాత్మక మార్పులపై ఎమ్మెల్యే కామినేని లోకేష్ని అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి స్కూల్స్,కాలేజీల నందు అదనపు తరగతి గదులకు, కాంపౌండ్ వాల్స్ ,మిగిలిన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన ఆమోదించాలని అభ్యర్థించారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై లోకేష్తో కూలంకుశంగా చర్చించారు. ఇరువురి చర్చల్లో భాగంగా నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటు చేసి,మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం తీసుకోవలసిన చర్యలపై కూడా చర్చించటం జరిగింది.

## జగన్ మోహన్ రెడ్డిని కలిసిన మలిరెడ్డి పాపారావు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :**మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వ కలిసిన గండేపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ పి నాయకం పల్లి గ్రామానికి చెందిన మలిరెడ్డి పాపారావు. ఈ సందర్భంగా ఆయన విడుదల తీసిన ప్రకట నలో మాట్లాడుతూ తమ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు భరోసా కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రతి గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని చెప్పినట్లు తెలిపారు. ఈయనతో పాటు నియోజకవర్గంలో పలువురు వైయస్సా ర్సీపి నాయకులు కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్ మోహన్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

# కార్మిక వర్గ నాయకులు పొన్నాడ రాము,రాములు వర్ధంతి సభ



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** కార్మిక వర్గ నాయకుడు పొన్నాడ రాము, వంకాల రాములు ప్రథమ వర్ధంతి సభను స్థానిక మీరా గ్రంథాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారంఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ జోహార్లు తెలియజేశారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశిస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మాట్లాడారు. పొన్నాడ రాము 12 ఏళ్ల వయసు నుండి కుటుంబ ఆర్థిక పరిస్థితులు వల్ల అటుకుల మిల్లులో అర్ధ రూపాయి రోజువారి కూలి పని చేస్తూ జీవితం ప్రారంభించారన్నారు. యువకుడిగా ఉండగా డివైఎఫ్ఐ యువజన సంఘం కార్యక్రమాలకు ఆకర్షితులై డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో చురుకైన కార్యకర్తగా పని చేస్తూ పట్టణ అధ్యక్షులు గా బాధ్యతలు నిర్వహించారు అన్నారు. అనంతరం కార్మిక వర్గ నాయకుడిగా సిఐటి యు సంఘంలో పనిచేస్తూ బజార్ జట్లు రైస్ మిల్ హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి పనిచేశారన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి, ఆశ,మిడ్ డే మీల్స్ మున్సిపల్ ,రైల్వే ,ఆర్టీసీ ఉద్యోగుల కార్మికుల సమస్యలపై జరిగే ఉద్యమాలలో సురుకైన పాత్రను రాము నిర్వహించారనిఅన్నారు.రిక్షా యూనియన్ నాయకుడిగా వంకాల రాములు రిక్షా కార్మికుల సంఘం పెట్టి రెండు వేల మంది రిక్షా కార్మికుల సమస్యలపై పనిచేశారని అన్నారు.అనంతరం సిఐటియు మాజీ నాయకులు పొగాకు నారాయణరావు మంచిలి నీలకంఠం మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్మిక వర్గ నాయకులు పున్నాన్ని అప్పలనాయుడు, పొన్నాడ మల్లేష్ బోడ సింగ్ అప్పారావు, పైల అప్పలనాయుడు పైలా ప్రసాద్ ,నాగేశ్వరరావు జగన్ తదితరులు పాల్గొన్నారు.

# 11 టన్నుల గోదానా అందజేసిన విజయవాడ వాసి నిమ్మగడ్డ



**ద్వారక తిరుమల,మేజర్ న్యూస్:** భారతీయ సంస్కృతిలో, గోమాత పవిత్రతకు, శుభానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా పరిగణించబడుతుంది. గోమాత నుండి లభించే పాలు, పేడ,మూత్రం వంటివి పవిత్రమైనవిగా భావిస్తారు. శ్రీవారి శేషాచల కొండపై గల స్వామివారి గోశాలకు విజయవాడ వాస్తవ్యులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు 11 టన్నుల గోదానా కోదండ చార్యులు కు అందజేశారు. వారికి శ్రీ స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి గోదానా బాండు పత్రాలను, ప్రసాదాలను, అందించి అభినందనలు తెలిపారు.

# జండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించిన హెచ్ఎం రాజు




**నరసాపురం, మేజర్ న్యూస్:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్కు వెళుతున్న బైక్ ర్యాలీని గురువారం కస్తూరిబా హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నల్లంరాజు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

# స్వస్తి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించిన టిడిపి నేత లంక సత్యనారాయణ



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: ప్రధానమంత్రి స్వస్తి నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సిహెచ్ పోతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు జి. యజ్ఞశ్రీ ఆధ్వర్యంలో గ్రామంలోని మండల ప్రజా పరిషత్ స్కూల్ నందు గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ,గ్రామ సర్పంచ్ కాస్సే శ్రీహర్రావు,సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున స్థానిక డ్వాక్రా మహిళలు, గ్రామ ప్రజలు, పాల్గొని బీపీ, షుగర్, రక్తహీనత, పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు మేరకు మందులు తీసుకున్నారు. అనుమానిత కేసులను ప్రాథమిక క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తీగల మహంకాళి, సాయిల రమేష్, సిహెచ్ పోతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, స్థానిక అంగనవాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నరసాపురం నుండి విశాఖపట్నంకు సింహాద్రి రైలు పునరుద్ధరించండి

**- డిఆర్ఎంకు వినతి పత్రం ఇచ్చిన వనమాల**



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** డివిజనల్ రైల్వే మేనేజర్ గురువారం నరసాపురం విచ్చేశారు. ఈ సందర్భంగాజాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వనమాల శ్రీనివాస్ మర్యాదపూర్వకముగా కలసి నరసాపురం నుండి విశాఖపట్నం వెళ్ళుటకు గతంలో ఉన్న సింహాద్రి ఎక్స్ ప్రెస్ ను పునరుద్ధించవలసినదిగా కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ నరసాపురం నుండి విశాఖపట్నం వెళ్ళుటకు కరోనా కు ముందు వరకు సింహాద్రి ఎక్సప్రెస్ ట్రైన్ ప్రతిరోజూ సాయంత్రం ఉండేదని, ఉత్తరాంధ్ర నుండి ఉపాధి నిమిత్తం వచ్చిన వెనుకబడిన కులాలకు చెందిన వారు అధిక సంఖ్యలో నరసాపురం పట్టణం లో నివసిస్తున్నరన్నారు. వీరు ఊరికి వెళ్ళటానికి ఈ ట్రైన్ వారికి అనుకూలంగా ఉండేదని,అదేవిదంగా ఈ ప్రాంతం నుండి అన్నవరం గుడికి వెళ్ళటానికి కూడా భక్తులకు ఈ ట్రైన్ చాలా సౌకర్యం గా ఉండేదన్నారు. కోవిడ్ సమయంలో సౌత్ సెంట్రల్ రైల్వే వారు కొన్ని ట్రైన్‌లు రద్దు చెయ్యటం జరిగిందని, అందులో భాగంగా ఈ ట్రైన్ కూడ రద్దు చెయ్యటం జరిగిందన్నారు. అయితే రద్దు చేసిన చాలా ట్రైన్ లు పునరుద్దరించటం జరిగింది. కాని సింహాద్రి ఎక్స్ ప్రెస్ ట్రైన్ మాత్రం అప్పటినుండి పునరుద్దరించ లేదని వివరించారు.

# ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం




**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** 65 ఏళ్ల ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చరిత్రక ఉద్యమ విజయాలను చవి చూసిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా ఉద్యమం దిక్సూచి అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సంస్మరణ సభ గురువారం స్థానిక ఎం.బి సోషల్ క్లబ్ లో జరిగింది. సభలో ముందుగా సురవరం చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకట రమణ రాజు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,ప్రజా సంఘాలు, పార్టీ నాయకులు కారం డాక్టర్ దారయ్య, బాడిస రాము, ఎన్.రామ్మోహన్, అల్లూరి రామకృష్ణ ,టీవీఎస్ రాజు,బాల యేసు,తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జంగారెడ్డిగూడెం టుబాకో బోర్డు అక్షన్ సూపరింటెంటెంట్ బి.శ్రీహరి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని వేలం కేంద్రంలో నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైతులు,వేలం కేంద్రం అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల జోక్యం విడనాడాలి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములు పేదలు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. భూస్వాములతో కుమ్మక్కై అధికారులు పెడుతున్న పోలీస్ కేసులను పేదలపై నిర్బంధాన్ని ప్రభుత్వ అధికారులు విడనాడాలని ధర్నా నిర్వహించారు.ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు యాగంటి సీత, జిల్లా అధ్యక్షులు జీవరత్నం, జి వెంకటరావు తదితరులు ఆర్డీవోకు వినతి పత్రం అందించారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేసిన టిడిపి నేత లంకా



**ద్వారక తిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని ఐ యస్ రాఘవపురం గ్రామం లో శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు కృషితో రాఘవరాజు అనసూయ కి మంజూరు అయిన 30వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిది చెక్కును రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎ యమ్ సి వైస్ చైర్మన్ పోతన ధర్మరాజు,జి. కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు, సొసైటీ డైరెక్టర్ లేగల మహంకాళి, గ్రామ సర్పంచ్ కస్సే శ్రీహరి,జజులకుంట పార్టీ అధ్యక్షులు సాయిల రమేష్, రేగంటి వినోద్,స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

# అన్నదానాలకు అందరూ సహకరించాలి : పేరిచర్ల ఫౌండేషన్




**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** దైవిక కార్యక్రమాలకు, అన్నదానాలకు దాతలు సహకారం ముఖ్యమని, పేరిచర్ల ఫౌండేషన్ స్ఫూర్తి దాయకం అని జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, టీడీపీ పట్టణ అధ్యక్షులు పట్నాల వెంకట రాంపండు అన్నారు. స్థానిక రామారావు పేట గణేష్ యూత్ 24 గణపతి నవరాత్రులు అన్న సమారాధన కార్యక్రమం కు పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు రూ. 20వేలు నగదు డైమండ్స్ లయన్స్ క్లబ్ తరుపున రైస్ బ్యాగ్స్ ను కాశీ చేతులు మీదుగా గణేష్ యూత్ కమిటీ వారికి అందచేశారు. వర్తనపల్లి కాశీ, పట్నాల రాంపండులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పేరిచర్ల ఫౌండేషన్ సేవల్లో పాల్గొంటున్నానని పార్టీలకు అతీతంగా పేరిచర్ల మురళీ కృష్ణంరాజు సేవలు నియోజకవర్గంలో దిగువ వర్గాలకు అందుతున్నాయని అన్నారు. దాతలు డైమండ్స్ లయన్స్ సభ్యులు మద్దుకూరి మెహర్ ప్రసాద్, కోటి విజయ్ కిషోర్, కాళ్ల గోపికృష్ణ, జొన్నల సతీష్, సత్తి బాబు, మానేపల్లి వెంకట సునీల్ కుమార్ బియ్యం బస్తాలు అందించారు. లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ దైవిక సామజిక సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం పేరిచర్ల ఫౌండేషన్ డైమండ్స్ లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తూయువతకి ప్రోత్సాహం అందిస్తున్నామని 24 సంవత్సరాలనుండి గణేష్ యూత్ గణపతి నవరాత్రులు చేయడం వారిని ప్రోత్సాహం అందిస్తున్న సహకరిస్తున్న దాతలుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సమన సత్యనారాయణ యర్రా ఆంజనేయస్వామి, మృతుంజయ కుమార్, కన్నాజీ శ్రీనివాస్ లు గణేష్ యూత్ కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జాలాది రవిని అభినందించిన విద్యావేత్త అలుగు ఆనంద్ శేఖర్



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో భారతీయ అంత ర్జాతీయ పారిశ్రామిక సేవల రంగానికి ఎందరో మేనేజ్మెంట్ నిపుణులను అందించిన ఆంధ్ర విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం అధిపతి ప్రొఫెసర్ జాలాది రవికి ప్రతిష్టాత్మకమైన బెస్ట్ టీచర్ టాపర్ అవార్డు వచ్చిన సందర్భంగా ప్రముఖ విద్యా వేత్త డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్ గురువారం అభినందనలు తెలిపారు. రెండున్నర దశాబ్దాలుగా ఆంధ్ర విశ్వ విద్యాలయ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగంలో టీచర్ గా పని చేస్తున్న ప్రొఫెసర్ రవి సుమారు 50 మందికి పైగా పరిశోధన విద్యార్థుల కు పీహెచ్డీ పట్టాలకు గైడెన్స్ ఇచ్చారు. 4 జాతీయస్థాయి సెమినార్లను నిర్వహించారు. విశ్వవిద్యాలయ స్థాయిలో అనేక జాతీయ అంతర్జాతీయ సెమినార్లు నిర్వహించారు. జాతీయ స్థాయి మ్యాగజైన్స్లో 20కి పైగా ఆర్టికల్స్ ప్రచురించారు. జాతీయ స్థాయి ఎన్సిసి పీర్ కమిటీ సభ్యుడిగా ఆంధ్ర విశ్వ విద్యాలయ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగ అధిపతిగా గొప్ప విద్యా వైజ్ఞానిక సేవ చేస్తున్న ప్రొఫెసర్ జాలాది రవిని వారి కార్యాలయంలో డాక్టర్ అలుగు కలిశారు. ఆయనతో పాటు విశ్వ విద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,జర్నలిజం,మాస్ కమ్యూనికేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం ఆంధ్ర విశ్వవిద్యా లయ ఇంజనీరింగ్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ రాజ్ కుమార్,తదితరులు ఘనంగా సత్కరించి, అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలి

**– దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్**



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నట్లేనని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర కుమార్ అన్నారు. గురువారం ఆ సంఘం మండల శాఖ సమావేశం మండలంలోని సీతారాంపురం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసే కుట్రలో భాగమే ఈ నిర్ణయం అన్నారు. తక్షణం ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు జె విజయ్ కుమార్, కాటిక తాతారావు, డి సురేష్ బాబు, ఎం వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛమైన నీరు తాగడం ఆరోగ్యానికి మేలు






**– చినఅమిరం జడ్పి హైస్కూల్లో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే**

**భీమవరం,మేజర్ న్యూస్ :** స్వచ్ఛమైన నీరు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది, సురక్షితమైన మంచినీటిని అన్ని పాఠశాలలో అందిస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం చిన అమిరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పీవీ ఎంటర్ ప్రైజెస్ సౌజన్యంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. స్వచ్ఛమైన మంచినీరు ఇదిశరీరాన్నిశుభ్రపరుస్తుందని,జీర్ణక్రియను మెరుగుపరుస్తుం దని, చర్మాన్ని మెరిసేలా చేస్తుందన్నారు. శుభ్రమైన నీరు తాగడం వల్ల ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడకుండా ఉంటారని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ను దాతల సహకారంతో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరిబాపి రాజు, బుద్దరాజు శ్రీనివాస రాజు,ఇందుకూరి రామలింగ రాజు, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్య నారాయణ మూర్తి కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రసాద్‌కు ఎమ్మెల్యే చంటి అభినందనలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తేరా ప్రసాద్‌ని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాతో కలసి విద్యాభ్యాసంచేసి నేడు నా నియోజకవర్గంలో నివాసం ఉంటూరాష్ట్రఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన మా చిన్ననాటి మిత్రుడు తేరా ప్రసాద్ ని చూస్తే నాకు చాలా గర్వంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ద్వారా అవార్డు పొందిన నా మిత్రుడికి సన్మానం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని వివరాంచారు. ఈ కార్యక్రమంలో పుట్టి శ్రీరాం ప్రసాద్ ఎల్ఐసి ఏజెంట్, ఆంధ్ర శ్రీనివాస్ క్లాత్ మర్చంట్, యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్ రావు,తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యని ప్రసాద్ బృదం సత్కరించారు.

## అపుస్మా ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**పెనుగొండ,మేజర్ న్యూస్:** గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరచడం సమాజం ఉన్నతతనానికి నిదర్శనమని, అటువంటి ప్రత్యేకతను ఎల్లప్పుడూనిలబెట్టుకుంటున్న సంఘం అపుస్మా అని రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జంగా బాలాజీ పేర్కొన్నారు. పెనుగొండలోని రెడ్డి కళ్యాణ మండపంలో, ఆచంట జోన్ అపుస్మా ఆధ్వర్యంలో జోన్ అధ్యక్షులు జి.వి.ఎస్. రవికుమార్ అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగా బాలాజీ మాట్లాడుతూ "గురువులు కేవలం పాఠాలు చెప్పేవారు కాదు, వారు జీవితాన్ని తీర్చిదిద్దే శిల్పులు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతి వెలిగించే వ్యక్తులు అన్నారు. అపుస్మా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు అక్కినేని కృష్ణ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు గురువుల చేతుల్లోనే ఉంటుంది. ఉపాధ్యాయ సేవలను గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించడం" అని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి జీ. రామకృష్ణ మాట్లాడుతూ "ఉపాధ్యాయులు మార్గదర్శకులు అన్నారు. ఉత్తమ ఎంఇవో అవార్డు గ్రహీత, పెనుగొండ ఎంఇవో–2 పి. రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని 34 పాఠశాలలకు చెందిన 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మానవత కార్యదర్శి కొమ్ముల రామకృష్ణ దంపతులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ టి.సంజీవరెడ్డి, జోన్ గౌరవ అధ్యక్షులు పి. వెంకట రెడ్డి, కార్యదర్శి కె.రవికుమార్, కోశాధికారి ఎం. రమేష్ రెడ్డి, జిల్లా కోశాధికారి జీ.చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రమేష్, జీ.కేశవ, రవికుమార్, కేశవమూర్తి, బాబ్జీ పాల్గొన్నారు.

## కన్నాపురం రేంజ్ అధికారిగా భాను ప్రకాష్



**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** కన్నాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బాధ్యతలను స్వీకరించిన భాను ప్రకాష్‌కు డి.ఆర్.ఓ. జె. ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎఫ్ ఎస్ఓలు చిరు సత్కారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ గిరిజనులకు అటవీ హక్కుల పై అవగాహన పెంచుతామని అన్నారు. అడవి సంపదను దోచుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కన్నాపురం రేంజ్ పరిధిలో ఉన్న అటవీ సంపద తరలిపోకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ,ఎస్ ,ఓ, లు కరీం , పోసరావు ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆమోదం పొందిన జంగారెడ్డిగూడెం మాస్టర్ ప్లాన్

**– ఫలించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కృషి**



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** జంగారెడ్డిగూడెం పట్టణానికి సూపర్ శుభవార్త ఇది. ప్రభుత్వం ఆమోదం పొందిన పట్టణ మాస్టర్ ప్లాన్. ఇంతకాలం ఏ ఎమ్మెల్యే ఆలోచించని విధంగా నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి పెడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు పట్టణ వాసులు గురువారం అభినందనలు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో అతిపెద్ద పట్టణమైన జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీకి సంబంధించి రూపొందించిన డెవలప్మెంట్ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించింద ని శాసనసభ్యులు రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్లానింగ్ డిపార్ట్మెంట్‌కు చెందిన రీజనల్ డైరెక్టర్ శాసనసభ్యులకు మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచిన అంశాలను అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు, కమర్షియల్ జోన్, ఇండస్ట్రియల్ జోన్, రెసిడెన్షియల్ జోన్ లతోపాటు పట్టణంలో డిటిపిసి అప్రూవల్ పొంది ఉన్నలే అవుట్లు,పట్టణంలో ముఖ్య దేవాలయాలు, కాలువలు, విద్యాసంస్థలను పొందు పరచినట్లు వివరించారు. పట్టణానికి చెందిన ముఖ్య నాయకులతో,ప్రజలతో రోషన్ కుమార్ సమావేశమై మాస్టర్ ప్లాన్ ను పరిశీలించి,ఆమోదం తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణతో చర్చించిన అనంతరం ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పరిణామంతో జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధికి,నిధుల లభ్యతకు మార్గం సుగమం అయిందని ఎమ్మెల్యే అన్నారు.

## మానవ మనుగడకు ఓజోన్ పొర చాలా అమూల్యమైనది



**ఏలూరు,మేజర్ న్యూస్ :** సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిని రక్షించే వాయుపొర ఓజోన్ పొర. జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరను కాపాడుకోవడం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించడానికి ఓజోన్ డే నిర్వహిస్తున్నమని డాక్టర్ సి ఎ జ్యోతిర్మయి తెలిపారు. స్థానిక సెయింట్ థెరీసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో నిర్వహించిన ఓజోన్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిఏ జ్యోతిర్మయి ప్రసంగించారు. మానవ మనుగడకు ఓజోన్ పొర చాలా అమూల్యమైనదని అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కుమారి వాసంతి, కుమారి సిరి ప్రథమ ద్వితీయ బహుమతులను పొందగా, రమీజా గ్రూప్ ,భావన గ్రూపులకు లఘునాటికలో ప్రథమ,ద్వితీయ బహుమతులు,క్విజ్ పోటీలో గాయత్రి, మౌనిక,సమీరా గ్రూపులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు లభించాయి. ఈ కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.రమా,మాధవి నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులను, విద్యార్థినిలు,విజేతలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సునీలరాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సిస్టర్ సుశీల ,ఇతర అధ్యాపకులు అభినందించారు.

## నూతన డిఎల్పిఓగా వెంకట సుబ్బరాయన్



కుక్కునూరు,మేజర్ న్యూస్ : రాష్ట్రంలో డిప్యూటీ ఎంపీడీవోలు గా పనిచేస్తున్న కొందరు అధికారులకు వారి సర్వీస్ రూల్స్ ప్రకారం కొందరికి ఎంపీడీవోలుగా ప్రమోషన్లు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా ద్వారకాతిరుమల మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకట సుబ్బరాయనకు ఎంపీడీవో గా ప్రమోషన్ ఇవ్వడంతో జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారిగా గురువారం నాడు బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా నా బాధ్యతలు నిర్వహిస్తానని వారు అన్నారు ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మరియు ఎంఆర్‌సిలు రాజు హరి రమేష్ రత్నం విజయవర్తిన్ ప్రభుదాస్ వారికి పూలమాలతో స్వాగతం పలికారు.

# 25న గుంటూరులో విద్యారంగ సమస్యలపై బహిరంగ సభ



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారానికి,పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిల ప్రయోజనాలు డిమాండ్ చేస్తూ ఈ సెప్టెంబర్ 25వ తేదీన రాష్ట్రస్థాయి భారీ బహిరంగ సభను గుంటూరులో నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా 5 ప్రాంతాల్లో జరుగుతున్న యుటిఎఫ్ ప్రచార భేరిలో భాగంగా గోదావరి రణభేరి ప్రచార జాతకాలు గురువారం సిద్దాంతం నుండి ప్రారంభమైన జాతకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం నుండి ప.గో. జిల్లా సిద్ధాంతం వద్ద ప్రవేశించిన జాతకు జిల్లా యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం పాలకొల్లు కు రణభేరి చేరింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో బోధ నేతల పనుల భారంతో ఉపాధ్యాయులు బోధనకు దూరం అవుతున్నారని ఈ పరిస్థితిని మార్చాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు ఏకేవీ రామభద్రం,రాష్ట్ర కార్యదర్శులు టి చక్రవర్తి ఎస్ జ్యోతిబాసు బి సుభాషిని కె శ్రీదేవి కాకినాడ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సూరిబాబు కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం టివి సుబ్బారావు రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు టి విజయ్ కృష్ణ తదితర రాష్ట్ర బాధ్యులు ఈ జాతకు నాయకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సిహెచ్ పట్టాభి రామయ్య సహచరు సిహెచ్‌నాగ శిరోమణి కే రాజశేఖర్ కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ జిల్లా కార్యదర్శులు పిశివప్రసాద్ పిజే కుమార్ జిలక్ష్మీనారాయణ జి.రామకృష్ణంరాజు కెశ్రీరామకృష్ణ ప్రసాద్ సిహెచ్ కుమార్‌బాబ్జి డి ఏసుబాబు డి పద్మావతి పి కృష్ణకుమారి. ఎంశ్రీనిబాబు కే.బ్రహ్మయ్య రాష్ట్ర కౌన్సిలర్లు జీవీబీ రామానుజరావు పిల్లి శ్రీనివాసరావు ఎంవి రాజశేఖర్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అబ్రహం ఎం.విరాజేశ్వరరావు జిల్లా వివిధ మండల పట్టణ శాఖలముఖ్యనాయకులుపెద్దసంఖ్యలోయుటిఎఫ్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కొణితివాడ శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం పాలకవర్గ ప్రమాణం

**– గాలిగోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే రామాంజనేయులు హామీ**



**వీరవాసరం,మేజర్ న్యూస్ :** వీరవాసరం మండలం కొణితివాడ గ్రామం శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పీఏసీ చైర్మన్,జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి హాజరయ్యారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో యరకరాజు వెంకట్రామరాజు దేవస్థానం చైర్మన్‌గా,పాలకవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ తాను చూసిన దేవాలయాలలో ఇటువంటి పవిత్రమైన ఆలయాన్ని ఎక్కడా చూడలేదని తెలిపారు. ఈ దేవాలయానికి గాలిగోపురం నిర్మాణానికి గ్రామంతో పాటు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఆలయ అభివృద్ధికి పాలకవర్గం తీసుకున్న సంకల్పాన్ని స్వాగతించారు.

## మహిళల ఆరోగ్యం పై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి : కమిషనర్



నరసాపురం, మేజర్ న్యూస్ : స్థానికమునిసిఫ్ వీది, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్తి నార సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ మోహన కారిచర్ల, డాక్టర్ రంజిత్, గైనకాలజిస్ట్ విజ్ఞాని గారు సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమీషనర్ యం అంజయ్య మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతేక దృష్టి సారించి ఇలాంటి అద్భుతమైన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు అని అన్నారు. ఇవి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ శిభిరంలో రక్తపోటు, మధుమేహం, కాన్సర్ వ్యాధులు, తల్లి, బిడ్డల సంరక్షిణ, కిషోర్ బాలికల ఆరోగ్య పరీక్షలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ వో ప్రసాద్,కోటిపల్లి సురేష్, తిరుమాని శశిదేవి మల్లాడి బుజ్జి,పెమ్మాడి వెంకట శ్రీదేవి,న రహరశెట్టి రూపవాణి,గుడాల సునీత తదితరులు పాల్గొన్నారు.

## కివ్వాకలో ప్రమాదకరంగా కరెంటు తీగలు



**కుక్కునూరు,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కివ్వాక గ్రామపంచాయతీ నందు ఉన్న చెట్లు విపరీతంగా పెరిగిపోయి పక్కనే ఉన్న కరెంటు తీగలకు పూర్తిగా అల్లుకుపోయి చిన్నపాటి వర్షం లేదా గాలి వచ్చిన ఆ తీగలకు ఆనుకొని మంటలు రావడం జరుగుతుంది ఆ మంటలకు పక్కనే ఉన్న ప్రజలు భయపడిపోతున్నారు ఏ రోజు ప్రాణాపాయం తిరుగుతుందో తెలియక భయంతో బిక్కు బిక్కుమంటూ భయభ్రాంతులకు గురవుతున్నామని ఈ సమస్యను మండల విద్యుత్తు అధికారికి గత నెల రోజుల నుండి చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెట్లు తొలగించి ప్రజలను కాపాడాలని కోరుకుంటున్నారు.

# కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం





**– కోరుకొల్లు రోడ్‌లో కబ్జా పర్వం – అమ్మకాలు కొనసాగుతున్న వైనం**
**– అక్రమణ నిజమే – హెచ్చరిక బోర్డులు ఏర్పాటు ఇరిగేషన్ ఏఈ**

**మండవల్లి / కైకలూరు,మేజర్ న్యూస్,** మండవల్లి మండలంలోని లోకుమూడి రెవిన్యూ పరిధిలో కోరుకొల్లు రోడ్‌లో ప్రభుత్వ భూములపై కూటమి నాయకులు మని చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేసి రూ.కోట్లను అక్రమ మార్గంలో సంపాదిస్తున్నారు. అయినా ప్రభుత్వ భూములను సంరక్షించే అధికారులు కబ్జాదారులకు అండగా నిలబడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఈ తతంగం సాగిస్తున్నా చూసీచూడ నట్లుగా వ్యవహరిస్తున్నారు. రూ.కోట్ల విలువ చేసే భూములు రాజకీయ ముసుగులో విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. కోరుకొల్లు రోడ్ లో ప్రధాన రహదారి పక్కనే 1.04ఎకారాల ప్రభుత్వ ఇరిగేషన్ భూమి మిగిలి ఉంది.ఆ భూమిపై సమీప గ్రామం లోని ప్రజాప్రతినిధులు కన్ను పడింది. ముగ్గురు వ్యక్తులు ఏ పార్టీ అధికారం లో ఉన్నా ఆ పార్టీ లోనికి మారుతూ నేడు అధికార పార్టీ అండదండలతో కోట్ల విలువైన ప్రభుత్వ ,ఇరిగేషన్ భూముల స్థలాలను ఆక్రమించుకున్నారనే ప్రచారం జరుగుతోంది.యథేచ్ఛగా అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఒక్కో ప్లాట్ రూ.6లక్షల నుంచి రూ.8లక్షలకు విక్రయించారనే వదంతులు లేకపోలేదు. వీళ్లు గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వంలో పెద్దలకు దగ్గరగా ఉంటూ ఆక్రమణలు చేసి అమ్మకాలు చేస్తున్నారు.అంతేకాకుండా ఏకంగా ఇరిగేషన్ అధికారుల అండదండలతో కాలువ అడ్డురాకుండా రెండు వైపులా కాంక్రీట్ గోడలు కట్టి ప్లేట్‌లు ఏర్పాటు చేసి మట్టితో కప్పారు.గతంలో కొందరు స్థానికులు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయగా అధికార కూటమి పార్టీ పేరు చెప్పి వ్యవహారం సాగిస్తున్నారని సమాచారం.ఈ విషయం పై ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా స్థలం ఆక్రమణకు గురయిన విషయం తెలిసిందని,సిబ్బందిని పంపి హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేశామన్నారు.చట్టం ముందు అందరూ సమానమని ఇరిగేషన్ స్థలాలు అక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

# 21న జరిగే వైద్యుల ఆత్మీయ సమావేశానికి తరలిరండి



**మండవల్లి / కైకలూరు,మేజర్ న్యూస్,** ఈనెల 21వ తేదీ న ఆర్.ఎం.పి, పిఎంపి వైద్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు విజయవాడ ఎన్ఎసి కళ్యాణ వేదికలో జరిగే ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశానికి గ్రామీణ వైద్యులందరూ తరలివచ్చి సమావేశాన్ని జయప్రదం చేయాలని గ్రామీణ వైద్యులు సంక్షేమ సంఘం బి.కృష్ణా అధ్యక్షులు బి.వెంకటరాజు,సెక్రటరీ లంకపల్లి రవి తదితరులు ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. ఆరు దశాబ్దాలపైగా చట్టబద్ధత కోసం గ్రామీణ వైద్యులు ఎదురుచూస్తున్నారని అందుకు నాంది వాచకం ఈ సమావేశం అవ్వాలని కోరుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు ఫెడరేషన్లలోని ప్రతి ఒక్క ఆర్ఎంపీ, పి.ఎం.పివైద్యుడు, వైద్యురాలు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఉమా మహేశ్వరావు, ఎన్.రాంబాబు,సూర్య ప్రకాష్ రావు,జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆది కర్మయోగి అభియన్ అవగాహన కలిగి ఉండాలి




**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** ఆది కర్మయోగి అభియన్ లక్ష్యాలు ప్రయోజనాలు పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పి వి టి జి డివిజన్ ప్రాజెక్ట్ అధికారి రషబ్ చతుర్వేది అన్నారు. కోయ రాజమండ్రి, నాగన్న గూడెం గ్రామాలను సందర్శించి ట్రాన్స్ సెట్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. నాగన్న గూడెం గ్రామ ంలో పీఎం జన్ మాన్ పథకం కింద మంజూరైన ఇళ్ళను ఆయన పరిశీలించారు. మండలంలోని రాజానగరం గ్రామంలో ఏర్పాటుచేసిన ఆది సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయనతో పాటు ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, బుట్టాయగూడెం ఇన్ చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ జడ్పిటిసి రామ తులసి, నాగన్నగుడెం, కోయ రాజామండ్రి, రాజానగరం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ ఫైల్స్ తప్పనిసరి



**– జిల్లా ప్రగతికి సమన్వయంతో కృషి చేయాలి : జిల్లా కలెక్టర్**

**భీమవరం,మేజర్ న్యూస్ :** గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల నుంచి కలెక్టర్ కు వచ్చే ప్రతి దస్త్రం తప్పనిసరిగా ఇ-ఆఫీస్ ఫైల్ విధానంలోనే రావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో కాగితం దస్త్రాలను క్రమేపి తగ్గించాలన్నారు. పారదర్శకత కొరకు ప్రతి దస్త్రాన్ని ఆన్ లైన్‌లో ఉంచాలన్నారు. అన్ని శాఖలు ఉత్తమ పనితీరును కనబరిస్తేనే జిల్లా అన్ని రంగాలలో ముందుంటుందని,తద్వారా స్థిరమైన జిడిపిని సాధించ గలమన్నారు. ఆర్థికంగా బలమైన జిల్లాగా పేరుగాంచినా,కొన్ని శాఖల పనితీరును మెరుగు పరచు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అక్షరాస్యతలో మెరుగైన ప్రగతిని సాధించాలని, చదివే ప్రగతికి మూలం అన్నారు.జిల్లాలో నిరక్షరాస్యత అనేది ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదన్నారు. ఇందుకు తగిన విధంగా విద్యాశాఖ నిరంతర కృషి చేయాలని సూచించారు. పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలన్నారు.జూమ్ కాన్ఫరెన్స్‌లోజిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి




**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** విఆర్ఏలకు పేస్కేలు అమలు చేసి నామినీలకు వీఆర్ఏలుగా నియమించాలని మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షులు యాళ్ళ రాజేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవిన్యూ వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ సేవకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి పదోన్నతులు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఎంతోకాలంగా సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమాల ప్రక్రియకు వీఆర్ఏలు సంఘటితంగాఉండి పరిష్కరించుకోవాలన్నారు. ఈనెల 22న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పరిసే రాఘవేంద్రరావు , ఉపాధ్యక్షులు గొల్ల స్వాతి , కోశాధికారి కాగిత వసంతరావు , బలరామ్ , సురేష్, ప్రసాద్, నూర్జహాన్, శివపార్వతి, భవాని, గంగాధ్రావు , అన్నామణి, సునీత, సాయి, ముసలయ్య కోటేశ్వరరావు, సుమతి , చంద్రకాంత్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా ఎలుకల మందు పంపిణి



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని వరి సాగు చేసే అన్ని గ్రామపంచాయతీ లోనూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం వ్యవసాయ శాఖ గ్రామపంచాయతీల ద్వారా గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే మందును ఉచితంగా పంపిణీ చేశారు.బ్రోమోడైలిన్0.25శాతం సి బి మందును అలాగే గ్రామపంచాయతీ ద్వారా సమకూర్చిన నూకలు,నూనెను పట్టించి బ్రోమోడైలిన్విషపు ఎరును తయారు చేయించి రైతులందరికీ కూడా ప్రజాప్రతినిధుల ద్వారా వివిధ గ్రామాలలో రైతులకు కౌలు రైతులకు రైతులకు పంపిణీ చేశారు. నర్సాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి వి వి ఎన్ ఎస్ పి ప్రసాద్, అధ్యక్షతన వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి సంఘ డెల్టా ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్ గుబ్బల మారాజు,జడ్పిటిసి బొక్క రాధాకృష్ణ, రుస్తుం బాధ సర్పంచ్ బందెల భారతి రవీంద్ర, గొట్టుముక్కల సుజాత ,నల్లి వరలక్ష్మి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు రైతు సేవ కేంద్రం ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల కోర్కెలు పరిష్కరించాలి



**నరసాపురం,మేజర్ న్యూస్:** గ్రామ రెవెన్యూ సహాయకుల ( వీఆర్ఏ ) న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం, సిపిఐ నాయకులు కౌరు పెద్దిరాజు, ఆరేటి మృత్యుంజయ, నెక్కంటి క్రాంతి కుమారులు డిమాండ్ చేశారు. వీఆర్ఏ ల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం నుండి రెండు రోజులపాటు తహసిల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని,అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని, నామినీ వీఆర్ఏలను చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు మోటూరి మోషే,నరసాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాపాక వరప్రసాద్,కొండపల్లి వంశీ ఉపాధ్యక్షుడు ఎల్ల రామకృష్ణ, కోశాధికారి నీలం నాగ సుబ్బలక్ష్మి, అధిక సంఖ్యలో వీఆర్ఏలు పాల్గొన్నారు.

# 5 బార్లు లాటరీ ప్రక్రియలో ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్



**భీమవరం,మేజర్ న్యూస్:** గురువారం భీమవరం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు ఐదు బార్లకు సంబంధించి లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జనరల్ కేటగిరిలో 28 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా 15 బార్లకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఆగస్టు 30న పూర్తి చేసి బార్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. మిగిలిన 13 బార్లకు రెండవ విడత గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా 5 బార్లకు సంబంధించి మాత్రమే దరఖాస్తులు అందగా వాటిలో భీమవరం పరిధిలో నాలుగు, నరసాపురం పరిధిలో ఒకటి మొత్తం ఐదు బార్లకు ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు చొప్పున ఒకే అభ్యర్థి దరఖాస్తు చేసుకోవడంతో వారినే ఏకగ్రీవంగా ప్రకటిస్తూ బార్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.భీమవరం మున్సిపాలిటీ పరిధిలో గజిట్ నెంబర్.1 కు దాసరి సత్యనారాయణ, నెంబర్.2 కు పొన్నమండ రవిబాబు, నెంబర్. 4 కు పివివినాగేశ్వరరావు, నెంబర్.5 కు రాధా కట్ట నరసాపురం మున్సిపాలిటీ పరిధిలో గజిట్ నెంబర్.8 కు ఇలపకుర్తి సూర్య వెంకట ప్రకాష్ ఒక్కొక్క గజిట్ కు వీరే నాలుగు దరఖాస్తులు చొప్పున వేయడంతో వీరినే ఏకగ్రీవంగా ప్రకటిస్తూ బార్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.తాడేపల్లిగూడెంలో నాలుగు, తణుకులో 3, నరసాపురంలో ఒకటి మొత్తం 8 బార్లకు సంబంధించి మరొకసారి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సూచనలతో నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి ప్రభు కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు ప్రసాద్ రెడ్డి, అజయ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు కళ్యాణ్ చక్రవర్తి, బలరామరాజు, ఎం.శ్రీనివాసరావు, రాంబాబు, మణికంఠ రెడ్డి, స్వరాజ్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమ సమాజ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలి




**– సిపిఓ కంటిపూడి శ్రీనివాసరావు**

**భీమవరం,మేజర్న్యూస్** : పి–4 కార్యక్రమం అమలులో భాగంగా గురువారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళికా శాఖ గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదరికంలేని సమాజ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా పి–4 కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన సిబ్బంది ఈనెల 23వ తేదీన గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలలో మిగిలిన సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి పి–4 కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే మార్గదర్శకులతో బంగారు కుటుంబాలను అనుసంధానం ప్రక్రియ జరిగిందని. ఈనెల 20 నుండి 30వ తేదీ లోపు మార్గదర్శిల ద్వారా బంగారు కుటుంబాలకు పొందుతున్న సహాయాన్ని సిబ్బంది పరిశీలించాలన్నారు. మార్గ దర్శిల ద్వారా బంగారు కుటుంబాలకు సహాయం అందకపోతే వారిని కలిసి కారణాలు తెలుసుకొని మరొక మార్గదర్శిని అనుసంధానం చేసి బంగారు కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే సిపిఓ ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో విజయవాడ ప్లానింగ్ శాఖ తరపున అసిస్టెంట్ డైరెక్టర్ రోహిణి కుమారి, జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 20,21 తేదీల్లో ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలు



**ఏలూరు,మేజర్ న్యూస్** : అంబికా సంస్థలు,హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబికా సంస్థల వ్యవస్థాపకులు దివ్యశ్రీ ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20,21 తేదీల్లో వైయంహెచ్ఏ హాలులో ఆలపాటి రామచంద్రరావు సాహిత్య సంగీత మహోత్సవాలు రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు గురువారం స్థానిక వై ఎమ్ హెచ్ ఏ హాలులో నిర్వహించిన సమావేశంలో అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, తెలిపారు. ఉపాధ్యక్షులు ఎం.వి.ఎస్ నాగేశ్వరరావు,వేమా కోటేశ్వరరావు కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు యిరదల ముద్దుకృష్ణ కార్యనిర్వావాహక కమిటీ ఉపాధ్యక్షులు ఎల్ వెంకటేశ్వర రావు (ఎల్విఆర్) తెలియజేశారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ అంబికా సంస్థల ఖ్యాతిని ఏలూరు నుంచి ప్రపంచానికి విస్తరించిన ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలు కళ, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించడంలో భాగంగా స్థానిక వై ఎమ్ ఎస్ ఏ హాల్లో 20వ తేదీన ప్రముఖ సాహిత్య కళాకారులచే ఉదయం వద్దిపర్తి పద్మాకర్ నిర్వహణలో అష్టావధానాన్ని, సాయంత్రం సాహితీవేత్తలచే భువనవిజయ కార్యక్రమాన్ని, ఏర్పాటు చేశామని తెలియజేశారు. వై ఎం హెచ్ ఏ మేనేజ్మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు విచ్చేస్తారని,21వ తేదీన ఉదయం 10:30కు విద్యార్థిని విద్యార్థులకు యువతకు,రచయితలకు సాహిత్య కార్యక్రమం రాత సమీక్ష ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు సంగీత సమ్మేళనంలో భాగంగా చెన్నైకి చెందిన సాయి హేమంత్ కృష్ణ బృందం వారిచే నాసిక వేణునాదం, స్థానిక కళాకారులచే డాక్టర్ గుడిపాటి లలితా శర్మ నిర్వహణలో హేలాపురి సంగీత సౌరభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ,వైద్య విద్యాశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేయుచున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్ కమిటీ సహాయ కార్యదర్శి సిహెచ్ సాయి తేజ డాక్టర్ గుడిపాటి లలితా శర్మ,సహాయ కార్యదర్శి బొప్పన వెంకటరాజా,సభ్యులు బంకా ప్రసాద్,పిలగల కొండలరావు,ఏ పార్వతి రామచంద్రన్,కే హేమంత్ కుమార్,కొమ్మన వెంకటరమణ (కొండబాబు) ఎం సూర్యనారాయణ యాదవ్,శలా మాణిక్యాలరావు (రాజబాబు),ఎంవి రవీంద్ర,మారం అను,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వికాస్ దినోత్సవ వేడుకలు




**పెనుగొండ, మేజర్ న్యూస్:** ప్రపంచానికి మార్గదర్శనం చేసే స్థాయికి భారత్ వికసిస్తుందని నవజ్యోతి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు చింతాకుల గోపాలకృష్ణ. పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మేరా యువభారత్ ఆదేశాల మేరకు నవజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెనుగొండ శ్రీ విశ్వతేజ డిగ్రీ కళాశాల సెమినార్ యందు భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ పుట్టినరోజు సందర్భంగా జాతీయ వికాస్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వతేజ డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ జి. సూర్యనారాయణ మాట్లాడుతూ భారతదేశాన్ని విశ్వగురువుగా నిలపాలన్న సంకల్ప ప్రదాత నరేంద్ర మోడీ యని తెలిపారు. అనంతరం ప్రధాన వక్తగా విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు తమనంపూడి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదరికం, ఆకలి చావులు, ఉగ్రవాదం, అవనీతి లేని నవ భారత నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహనీయుడు భారత ప్రధాని నరేంద్ర మోడీ యని అన్నారు. పెనుగొండ పురవీధులలో మోడీ మారథాన్ (నడక ) చేశారు. ఈ కార్యక్రమంలో జక్కంశెట్టి దుర్గాప్రసాద్, కలగ మణికంఠ సతీష్, కోడి భాను, పండి రాము,బిజెపి పెనుగొండ మండల నాయకులు దంపనబోయిన మోహన్ కృష్ణ, కళాశాల యాజమాన్యం ,వివిధ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సాహితీ కిరీటి అవార్డుకు డా.బాలచందర్ ఎంపిక



**పెనుగొండ, మేజర్ న్యూస్:** కవి, రచయిత, డాక్టర్ బాలచందర్ కు శ్రీ శ్రీ కళావేదిక వారి సాహితీ కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు విలేకరులకు తెలిపారు. శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తనను ఈ అవార్డుకు ఎంపిక చేసి ఆహ్వానం పంపినట్లు ఆయన తెలిపారు.యస్ వి కె పి కళాశాలల పాలకవర్గం, ఉభయ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది బాలచందర్ కు అభినందనలు తెలియజేశారు.

# సైబర్ మోసగాడి వల నుండి స్వాధీనం చేసుకున్న రూ.40వేలు అందజేత



**ఏలూరు,మేజర్ న్యూస్** : సైబర్ మోసగాళ్ల వలలో పడి నాగ దాసరి భారత్ రత్న రాజు అనే వ్యక్తి పోగొట్టుకున్న రూ.40వేలను ఏలూరు సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ దాసు సిబ్బందితో రికవరి చేసి బాధితుడికి గురువారం అందచేశారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల పై సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ దాసు ఆధ్వర్యంలో వారు సిబ్బంది దర్యాప్తు చేశారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నాగ దాసరి భారత్ రత్న రాజు ఇండియా మార్ట్ ద్వారా డయాలసిస్ స్టాక్ (డయాలైజర్లు, రక్త ట్యూబులు) కొనుగోలు చేయగా, ఒక సరఫరాదారుడి మాయ మాటలతో రూ.40వేలు చెల్లించారు.

తరువాత ప్రతీ 30 నిమిషాలకోసారి రూ.10వేలు ఇవ్వకపోతే స్టాక్ పంపబోమని, ముందే చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వమని బ్లాక్మెయిల్ చేశాడు. పిర్యాదు ధారుడు వెంటనే 1930 కు రిపోర్ట్ చేయగా ఆ రిపోర్ట్ పై ఏలూరు సైబర్ సెల్ ఇన్స్పెక్టర్కి రాబడిన సమాచారంపై ఫిర్యాదు అందుకున్న వెంటనే సైబర్ సెల్ దాసు, కే.సురేష్ కానిస్టేబుల్తో కలిసి చర్యలు చేపట్టారు. బాధితుడు చెల్లించిన రూ.40వేలు మొత్తాన్ని తిరిగి రాబట్టారు. ఆ రికవరి సొమ్ము బాధితుడికి అందచేశారు.

# ప్రమాదకరంగా టి.నరసాపురం మండల ప్రధాన రహదారులు





టీ.నర్సాపురం,మేజర్ న్యూస్ : టి.నరసాపురం మండలంలోని పలు గ్రామాలకు చేరే ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. ఆ రహదారుల్లో నిత్యం పలు వాహనాలు ప్రమాదాలకు గురై ఇప్పటికే చాలామంది క్షతగాత్రులుగా మిగిలారు. ముఖ్యంగా టీ.నర్సాపురం – చింతలపూడి రోడ్డు మరీ అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ రోడ్డుకి భయపడి చాలామంది ఊరు విడిచి వెళ్లిన సందర్భం కూడా ఉందంటే అతిశయోక్తి కాదు. స్వతంత్రం వచ్చి ఇంతకాలం అవుతున్న ఈ మండల రోడ్ల పరిస్థితి తీరు మారలేదు. ఎంతమంది నాయకులు వచ్చినా, ఎన్ని పార్టీలు మారినా ఈ మండలంలో రోడ్ల దుస్థితి మారలేదు. మండలంలో టి.నరసాపురం నుంచి మల్లుకుంట వరకు వెళ్లే రహదారిలో టీ.నర్సాపురం, గుర్వాయిగూడెం, బొర్రంపాలెం, వల్లంపట్ల ,మల్లు కుంట గ్రామాల్లో ఆర్ అండ్ బి రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలకు నెలవుగా మారాయి. అలాగేమక్కినవారిగూడెం నుంచి లక్ష్మీపురం అప్పలరాజుగూడెం ఆర్అండ్‌బి రహదారిలో మక్కినవారిగూడెం, గంగినేనిపాలెం, బండి వారి గూడెంలలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి నిత్యం వాహనాలు బోల్తా పడుతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. వాటితోపాటు టీ.నర్సాపురం నుంచి బండివారిగూడెం సంగారాయపాలెం మర్రిగూడెం చేరే రహదారి గోతుల మయంతో పాటు చింతలవాగు ఉధృతికి వర్షాలు పడితే రహదారులు రాకపోకలు అంతరాయం ఏర్పడటం తప్పదు. వీటితోపాటు టీ.నర్సాపురం నుంచి బంధంచర్ల వెళ్లే 3 కిలోమీటర్లు రహదారి మహా ఘోరంగా ఉందని చెప్పుకోవచ్చు. అక్కడ రోడ్డు చూస్తే చెరువులను తలపిస్తూ ఉంటాయి.

వీటన్నిటితోపాటు టీ.నర్సాపురం మక్కినవారిగూడెం మధ్య దుర్గమ్మ ఆలయం వద్ద చింతలవాగు బండివారిగూడెం గంగినేడుపాలెం ముగ్గురాతి వాగు మధ్యాహ్నపు వారి గూడెం అప్పలరాజు గూడెం మధ్య ఉన్న ఎర్ర కాలవ వర్షాలకు ఉధృతంగా పొంగడంతో తరచూ పలు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగిన సందర్భం ఉందని చెప్పుకోవచ్చు.

ముఖ్యంగా మూగజీవాలు కూడా కొట్టుకుపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు వాగులపై వంతెనలు నిర్మించాలని, పలుమార్లు జిల్లా అధికారులకి విన్నవించుకున్నా ,ప్రజాప్రతినిధులకు,జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించినా ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

# అధిక చక్కెర,నూనె,జంక్ ఫుడ్ వినియోగం వల్ల ఊబకాయం



## – ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణ

పెనుమంట్ర,మేజర్ న్యూస్ : అధిక చక్కెర, నూనె, జంక్ ఫుడ్ వినియోగం వల్ల ఊబ కాయం వచ్చే ప్రమాదం ఉందని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణ కుమారి అన్నారు. గురువారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా పెనుమంట్ర 2, ఆలమూరు 3 అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల్లో ఊబకాయం, చక్కెర నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. బాలల్లో ఊబకాయం పిల్లల శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సును ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని డబ్ల్యు. హెచ్.ఓ పేర్కొందని, బాలల్లో ఊబకాయం ప్రమాదం నివారించడానికి తల్లిదండ్రులు వారి పిల్లల ఆహారపు అలవాట్లు తోపాటు రోజువారీ దినచర్య, శారీరక శ్రమ,నిద్ర వంటి విషయాల్లో శ్రద్ధ వహించాలని ఆమె అన్నారు.కిశోర బాలికల బరువు, ఎత్తు కొలవడం జరిగింది.ఆహార పదార్థాల తయారీలో చక్కెర నూనె వినియోగం తగ్గించడంవల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.ఆలమూరు3 అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ఎస్ వెంకటలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు,కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

# బుల్లెట్ కొంటానని తీసుకెళ్లి కత్తితో బెదిరించిన దొంగ అరెస్టు

## – అతని వద్ద నుండి 6 మోటార్ సైకిళ్లు స్వాధీనం



కలిదిండి,మేజర్‌న్యూస్ : బుల్లెట్ కొంటానని, ట్రైల్ వేస్తానని నమ్మించి,బండి యజమానిని కత్తితో బెదిరించిన కృష్ణానగర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా వాసి షేక్ ఇమ్రాన్ అనే యువకుడిని కలిదిండి పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివ కిషోర్,ఎఎస్పి నక్క సూర్యచంద్రరావు,డిఎస్పి డి.శ్రావణ్ కుమార్,తదితర పోలీస్ అధికారులు వెల్లడించారు. కలిదిండి గ్రామానికి చెందిన తలారి జాస్పర్ కిరణ్ తండ్రి శ్రీనివాసరావు పిర్యాదు ప్రకారం రాయల్ హెన్‌ఫిల్డ్ హంటార్ 350 బైక్‌ని అమ్ముటకు ఓఎల్ఎక్స్‌లో యాడ్ పోస్టు చేయగా,ఒక గుర్తుతెలియని వ్యక్తి బైక్ ని కొంటానని చెప్పి పిర్యాదు దారుడితో ఫోన్‌లో మాట్లాడి, గుర్వాయిపాలెం గ్రామ శివారు, మద్వానిగుడెం మలుపు వద్దకు వచ్చి, బైక్ చూసి ఒకసారి ట్రయల్ వేస్తానని చెప్పాడు. పిర్యాదుదృని వెనక ఎక్కించుకుని గుర్వాయిపాలెం వరకు వచ్చి, తిరిగి మద్వానిగుడెం మలుపు దగ్గరకు వచ్చి,ముద్దాయి కత్తి చూపించి బెదిరించాడు. బైక్ దిగకపోతే పొడిచి చంపుతానని బెదిరించగా, పిర్యాదు భయపడి కిందకు దిగగా ముద్దాయి బైక్ దొంగిలించుకు పోయాడు. ఈ కేసులో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డి.శ్రావణ్ కుమార్ అధ్యక్షతన, కైకలూరు రూరల్ సిఐ వి.రవికుమార్ సూచనల మేరకు,కలిదిండి పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి ముద్దాయి ని అరెస్టు చేసి, అతని దగ్గర నుండి సుమారు రూ.5లక్షల40వేలు విలువ చేసే 6 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ వి.వెంకటేశ్వర రావు,పిసిఎస్ బి.రమేష్,డి.వడ్డికాసులు, హెచ్‌జిఎస్ 280, 655 లను సిఐ ప్రత్యేకంగా అభినందించారు.

# మాజీ సీఎం జగన్‌తో మాజీ మంత్రి 'కొట్టు' భేటి



తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కలుసుకున్నారు. తాడేపల్లి లోని కేంద్ర కార్యాలయంలో గురు వారం జగన్ తో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పశ్చిమగోదావరి జిల్లా పార్టీ వ్యవహారాలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిస్థితులపై కొట్టు సత్యనారాయణ చర్చించినట్టు సమాచారం.

## పేదలపాలిట కల్పతరువు ఉచిత అంబులెన్స్‌ల సేవలు

### – ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : పేదల పాలిట కల్పతరువు గా పనిచేస్తున్న దేశప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు 15 రోజులు చేసే స్వచ్ఛంద సేవా కార్యక్రమం సందర్భంలో వారం రోజుల పాటు వేడుకగా రాష్ట్రవ్యాప్తం గా కూటమి ప్రభుత్వం పేదల కు ఉచిత వైద్యా సేవలను అందించే 108 అంబులెన్స్ లను గురువారం ఆయన తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ప్రారంభించడం శుభ పరిణామం అని రాష్ట్ర విప్, బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ పుట్టినరోజు వారోత్సవాలలో భాగంగా తల్లి బిడ్డ పరిపూర్ణ ఆరోగ్యం ఉండాలన్న కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవారికి ఉచిత సేవలను అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడప ప్రసాద్, నీలపాల దినేష్ యాదవ్, అడ్డగర్ల సూరి, గుండుమోగుల సురేష్, ఎర్రంశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గునుపూడి శివాలయానికి ట్రస్ట్ బోర్డ్ నియామకం

### – చైర్మన్‌గా చింతలపాటి బంగారాజు



భీమవరం,మేజర్ న్యూస్ : ప్రముఖ పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది.ట్రస్ట్ బోర్డు సభ్యులుగా చింతలపాటి బంగారాజు,బి సత్యప్రసాద్, బి.కృష్ణవేణి,పి.లీల, పి.వెంకట రామకృష్ణ,సాయి నాగేంద్ర విజయలక్ష్మి కుమారి, వై.రమేష్ ,బి.రమణ,పి.శ్యామ్ కుమార్,పి.జ్యోతిర్మయి,కె.విజయకుమార్, అర్చకులు కందుకూరి సోమేశ్వరరావు ఎక్స్ అఫీషియో నియమిస్తూ దేవదాయ శాఖ అధికారులకు ఉత్తర్వులు పంపించారు. రెండు సంవత్సరాల కాలపరిమితితో ట్రస్ట్ బోర్డు నియామకం జరిగింది. కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేసి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ చింతలపాటి బాపిరాజును ఎన్నుకోనున్నారు. ప్రఖ్యాత గునుపూడి శివాలయంకు సేవ చేసే అవకాశం కల్పించారంటూ భీమవరం ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులుకు ట్రస్ట్ బోర్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బి.ఐ.ఎస్ సమావేశానికి న్యూఢిల్లీ వెళ్లిన టీచర్ నల్లి పోసియ్య




పెంటపాడు, మేజర్ న్యూస్ : న్యూఢిల్లీలో ఇటీవల ప్రతిష్టాత్మక జి20 శిఖరాగ్ర సమావేశం జరిగిన భారత మండపం నందు ఈ నెల 15 నుండి 19 వరకు జరుగుతున్న సుమారు 100 దేశాల ప్రతినిధులు పాల్గొనే 59వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ జనరల్ మీటింగ్ , ఎగ్జిబిషన్ నందు పాల్గొనుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఒక ప్రతినిధిగా పెంటపాడు మండలం ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు నల్లి పోసియ్య కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ నుండి ఆహ్వానం అందడంతో ఆయన న్యూఢిల్లీ వెళ్లారు. ఈ అంతర్జాతీయ సమావేశంలో ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఎలక్ట్రానిక్ రంగంలో సాధించిన సాంకేతిక అభివృద్ధి ముఖ్యంగా భారత్ ఈ రంగాల్లో సాధించిన ప్రగతి గూర్చిన అవగాహన పొందడానికి ఐబిఎస్ సంస్థ కల్పించిన అరుదైన అవకాశంనకు గాను నల్లి పోసియ్య ధన్యవాదములు తెలిపారు.